# పల్లెల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

### కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య

కేశంపేట, జూన్ 20 : మండలంలో వారం రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులు కొనసాగుతాయని కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పల్లెల్లో శుక్రవారం ప్రారంభమైన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 28వ రకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, నీటితొట్లల్లో వారం రోజులకు మించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వేముల్‌నర్వ, పుట్టవానిగూడ, చింతకుంటపల్లి, కాకునూరు, తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, అలివేలు, మురళీ, రమాదేవి, అవినాశ్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.



వేముల్‌నర్వలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య

## అసైన్‌మెంట్ భూములకు రైతు భరోసా ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

యాచారం, జూన్20: అసైన్‌మెంట్ భూముల రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తించేలా చూడాలని కోరుతూ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో ఉన్న అసైన్‌మెంట్ భూములు ఉన్న రైతులందరికీ రైతు భరోసా కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో పేదలందరికీ ఇస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, నారాయణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జగన్, రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, జంగయ్య, విప్లవ్‌కుమార్, చంద్రయ్య, యాదయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు ప్రారంభం



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 20 : మండలంలోని మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలికల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారు నిర్మించిన అధునాతన మూత్రశాలలను శుక్రవారం ప్రారంభించారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారికి తెలిపిన వెంటనే స్పందించి రూ. 3లక్షలు బాలికల మూత్రశాలల నిర్మాణానికి అందించడం అభినందనీయమన్నారు. మరికొంత ఆర్థిక సాయాన్ని గ్రామస్తులు ఇవ్వడంతో మూత్రశాలల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వారని గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఇంద్రసేనారెడ్డి, రోటరీ క్లబ్ సహాయ గవర్నర్ గోవింద్ అగర్వాల్, పరాగ్‌షా, విజయ్‌సారథి, రాంరాజ్, అనీల్ కొత్తా, మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు రమేశ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు నాగమణి, జిలానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి



### మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, జూన్ 20: మున్సిపాలిటీ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్ట లేనివని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఎన్‌ఎస్ ఆర్ నగర్ కాలనీలోని చలసాని కల్యాణ మండపంలో మున్సిపల్ కార్మికులకు మెగా హెల్త్ చెకప్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల పాత్ర వెలకట్ట లేనిదని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు జరిపి వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్కుల అభివృద్ధికి కృషి

### అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్‌టౌన్, జూన్ 20: పట్టణంలోని పార్కుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని 9వ వార్డు రాజీవ్‌నగర్‌కాలనీ, వెంకటరమణకాలనీలోని పార్కుల అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లోని కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కాలనీవాసులకు ఆహ్లాదాన్ని అందించే పార్కులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్కుల అభివృద్ధితో కాలనీలు మరింత సుందరంగా మారుతాయన్నారు. పట్టణాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

**విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత**

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేయడంతో పాటు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే అత్యాధునిక హంగులతో కళాశాల నిర్మాణం పూర్తికానుందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు బస్వం, రఘు, ఇబ్రహీం, మాధవులు, సాధిక్, మంగులాల్, ప్రదీప్, దిలీప్, ఖదీర్, వాసు పాల్గొన్నారు.



పార్కుల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



అవార్డులు అందజేస్తున్న ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

షాబాద్, జూన్ 20: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదుగాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రగతి మండల ఎడ్యుకేషన్ అవార్డు- 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో 10వ తరగతిలో 450కిపైగా మార్కులు సాధించిన 107 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు, బ్యాగులు అందించి సత్కరించారు. అదేవిధంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 143మంది విద్యార్థినులను గుర్తించి ప్రోత్సహించారు. ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అందిస్తున్న రూ.లక్షా స్కాలర్‌షిప్ గాను ఎంపికైన షాబాద్ మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు సాయి సిరి, మణికంఠ, జహ్నవి, సమతలని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ మురళీకృష్ణ, కార్తీక్, ప్రగతి, తులసి, శృతి, శ్రీకాంత్, ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ



ఆమనగల్లు, జూన్ 20: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 8 వార్డుల్లో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పల ట్రస్టు సభ్యుడు ఆశ వర్కర్లతో కలిసి గర్భిణులకు మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ తరపున ఉచితంగా మెడికల్ కిట్లు, వైద్య సేవలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, నాయకులు జగన్, గణేశ్, దేవేందర్, శివ, శ్రీశైలం, గిరి, రవి, కిషోర్‌నాయక్, నిరంజన్, విక్రమ్, విమలమ్మ, లలితమ్మ, ఆశ వర్కర్లు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

### నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చేవెళ్లటౌన్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నేడు (శనివారం) మున్సిపల్ కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఉదయం 6గంటలకు యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అనంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి చేవెళ్ల ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారి

చేవెళ్ల టౌన్, జూన్ 20: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌లాల్ ఫర్టిలైజర్ షాపు యజమానులను హెచ్చరించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలేని విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల్లో ఎప్పటికప్పుడు స్టాక్ నిల్వల వివరాలను బోర్డులపై పెట్టాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 20 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యులైన రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు తమ వంతుగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నామని సహకార సంఘం చైర్మన్ భరత్ కుమార్‌యాదవ్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన రైతు సుగుణమ్మ ఈ నెల 5 మరణించింది. ఆమె కుమారుడు బొప్పాని లింగంకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ రూ. 25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అకౌంటెంట్ రాకేష్‌గౌడ్, రైతులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం చైర్మన్ భరత్‌కుమార్‌యాదవ్

## జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



జీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, జూన్ 20: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, గోపి, విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

### ముగిసిన రెవెన్యూ సదస్సులు





రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేస్తున్న భిక్షపతి

కేశంపేట, జూన్ 20 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు కేశంపేట మండలంలో శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆజంఅలీ మాట్లాడుతూ మండల పరిధిలోని సంగెం గ్రామంలో 18, పాపిరెడ్డిగూడ 21దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అయితే సంగెం గ్రామానికి చెందిన కుమ్మరి భిక్షపతి పేరునగల భూమిని రెవెన్యూ అధికారులు అతని కుమారుడి పేరున విరాసత్ చేయడంతో అభ్యంతరం తెలిపి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో డీటీ గీత, ఆర్ఐలు చెన్నకేశవులు, నివేధిత, రెవెన్యూ సిబ్బంది మహేశ్, అనసూయ, శివ పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

కడ్తాల్, జూన్ 20: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కడ్తాల్ సీఐ గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో... మత్తు పదార్థాలు, ఆల్కహాల్‌తో కలిగే నష్టాలు, ప్రమాదాల గురించి విద్యార్థులకు సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీతో జరుగుతున్న సైబర్ నేరాలు, చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థి దశలోనే నైతిక విలువలు, కుటుంబ బాధ్యత గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. కల్తీ కల్లు, మత్తు పదార్థాల వల్ల కలిగె దుష్ప్రభావాలను విద్యార్థులకు ఆయన వివరించారు. అదే విధంగా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది రాంకోటి, పాఠశాల హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చేవెళ్ల రూరల్, జూన్ 20 : చేవెళ్ల మండల పరిధి రావులపల్లి గ్రామంలో మలక్‌పేట యశోద దవాఖాన సౌజన్యంతో మాజీ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్యగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో దాదాపు 130 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, వైద్యులు శ్రావ్యసింధు, రియోరెడ్డి, అశోక్, ప్రియాసింధు, పంచాయతీ కార్యదర్శి లింగం, మాజీ ఉప సర్పంచ్‌లు నాగిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కుమార్, సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, యాదయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



పెద్దఅంబర్‌పేట, జూన్ 20: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని పట్టుదలతో చదవాలని పసుమాముల మాజీ సర్పంచ్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జైపాల్‌రెడ్డి సొంత డబ్బుతో శుక్రవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు శంకరయ్య గౌడ్, నర్సింగరావు, జంగయ్య, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, భిక్షపతి, మల్లేశ్, వెంకటేశ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, బాబుగౌడ్, హెచ్‌ఎం బాబురావు, ఉపాధ్యాయులు వాణికళ, సురేశ్, సాయి, శ్రీలత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ



కేశంపేట, జూన్ 20 : మండల పరిధిలోని భైర్ఖాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదయ్య శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామానికి 24 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 20ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. నిబంధనలను అనుసరించి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరిచారి, రూప్లానాయక్, అంజయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కేశంపేట, జూన్ 20 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని యోగా గురువు రామయ్య అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో యోగా గురువు రామయ్య ఆసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఏకాగ్రతను సాధించడంతోపాటు ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన పిల్లల ఆచూకీ లభ్యం

శంకర్‌పల్లి, జూన్ 20: తప్పిపోయిన ఇద్దరు పిల్లల ఆచూకీ లభ్యమైన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగడ్డకు చెందిన చిన్నారులు వడ్డే రేణుక, వడ్డే సంతోష్‌కుమార్ గురువారం నుంచి కనిపించడం లేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పిల్లల ఆచూకీ కర్ణాటకలోని సేడం తాలూకా మోత్కుపల్లి గ్రామంలో ఉన్నట్లు తెలిసిందని తెలిపారు.

### ఆంధ్రాలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగివ్వాలి

కొందుర్గు, జూన్ 20: పోలవరం తెలంగాణకు జల ఖడ్గం అని తెలంగాణ జాగృతి షాద్‌నగర్ నియోజకవర్గం మాజీ కన్వీనర్ ఎండి ముస్తఫా అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రాలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ప్రభుత్వం తీసుకొచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు లావణ్య, స్వప్న, బాలాజీ ఉదయ్, శీనూనాయక్, రమేశ్, పాండూనాయక్ పాల్గొన్నారు.



## శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

### పెచ్చులూడుతున్న స్కూల్ పైకప్పులు

### భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

కొందుర్గు, జూన్ 20: ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాం అంటూ గొప్పలకుపోతున్న పాలకుల మాటలకు పొంతన లేకుండా ఉంది. కొందుర్గు మండల పరిధిలోని బైరంపల్లి ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులుడుతుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొంది. తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతూ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కులుతుందోనని విద్యార్థులు ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నట్లు చెబుతున్నారు. పాలకులు, అధికారులు పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటూ అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో పెచ్చులూడుతున్న దృశ్యం

## దొంగతనానికి యత్నం..

### ముగ్గురు యువకులపై కేసు

మొయినాబాద్, జూన్20: దొంగతనానికి యత్నించిన ముగ్గురు యువకులు గ్రామస్తులకు చిక్కడంతో పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి బండారి, పుతిన్ బండారి, నిశాంత్ అనే ముగ్గురు యువకులు గురువారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజగూడలో సంచరించారు. గ్రామంలోని కురువ పెంటయ్య ఇంటి కిటికీలు తెరవడం, తలుపులు కొట్టడం చేయడంతో పాటు కావలి సంతోష్ ఇంటి గేటు పైనుంచి ఇంట్లోకి చూడడాన్ని గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు ఎం.డి మతిన్ గమనించాడు. వెంటనే గ్రామస్తులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారు దొంగతనం కోసమే గ్రామంలో సంచరించారని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.